


# పరదేశీ కథలు
## - చిట్టే సిద్ధ లలిత



- 95-

## దయ్యం పట్టిన సుధ

**పోస్ట్.. పోస్ట్.. కువైట్** నుండి జాబొచ్చిందమ్మా.." వాకిటి ముందు నిలిచి సైకిల్ బెల్లు మోగిస్తూ గట్టిగా అరిచాడు పోస్ట్ మాన్.

ఎసట్లో బియ్యం వేస్తున్నదల్లా ఆగి చేతులు పమిట కొంగుకు తుడుచుకుంటూ బయటికి పరిగెత్తుకుని వచ్చింది సుధ.

అప్పటికే పోస్ట్ మాన్ చేతిలోని జాబును అందుకున్న నరసమ్మ కొంగు చాటున దాచేస్తూ "ఇది మనకు కాదులే. కట్టకింది మంగమ్మకొచ్చిన జాబు. వెళ్ళి ఆమెకిచ్చివస్తా" అంటూ బయటికి వెళ్ళిపోయింది.

అత్త పోయిన వీధి పొడవునా ఒకసారి చూసి నిట్టూర్చి పొయ్యికాడికి పోయింది సుధ. దబరలో మరిగే ఎసరు లాగే సుధ హృదయం కూడా ఉడికిపోతోంది. కళ్ళు నీళ్ళతో నిండి మసకబారాయి.

మొగుడు మురళి కొయేటుకి పోయి సంవత్సరం అయింది. ఇప్పటికి ఒక్క జాబు కూడా రాయలేదు. ఎలా వున్నాడో ఏమయ్యాడో తెలియడం లేదు. మురళి రాసిన జాబులన్నీ సుధ కంట పడకుండా అత్తే మాయం చేస్తోందని ఆమెకు తెలుసు. కోమటోళ్ళింటికి మురళి ఫోన్ చేసినప్పుడల్లా సుధకు తలనొప్పిగా వుందని అతనికి కల్లబొల్లి కబుర్లు చెప్పి భార్యతో మాట్లాడనీయకుండా అడ్డుపడుతోందనీ తెలుసు. అత్తకు తన మీద అంత కక్ష ఎందుకో సుధకు అర్థం కావడం లేదు. ఇంట్లో పని మొత్తం సుధే చెయ్యాలి. తొలి కోడి కూయగానే సుధను నిద్ర లేపుతుంది నరసమ్మ. అప్పటినుండీ రాత్రి నిద్రపోయేదాకా యంత్రంలా తిరుగుతూ వంచిన నడుం ఎత్తకుండా పని చెయ్యాల్సిందే. పెళ్ళయిన నాలుగు నెలలకే మురళి కొయేటికి పోవాల్సి వచ్చింది.

సుధకు కూడా పాస్పోర్ట్ చేయించి ఆర్నెల్ల లోపల వీసా పంపిస్తానని, కొయేటికి పిలుస్తానని ఒట్టేసి చెప్పాడతడు. మురళి మాటల మీద సుధకు నమ్మకం వుంది. కానీ మధ్యలో అత్త నరసమ్మ ఏదో నాటకాలు ఆడుతోందని సుధకు అర్థమవుతోంది.

ఎందుకిలా చేస్తున్నావని అడగలేని పరిస్థితి ఆమెది. అడిగితే ఇంకేమైనా వుందా. ఎలాగైనా భర్తతో ఒకసారి మాట్లాడాలని ఆమె ప్రాణం అల్లాడిపోతోంది.భర్తను తలచుకుంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. బేలగా మారింది హృదయం. ఓపిక నశించింది. ఇక ఏదో చెయ్యాలి లేదా ఎదురు తిరగాలి అనుకుంది కుతకుత వుడుకుతున్న పొయ్యిమీది అన్నాన్ని చూస్తూ.

అక్కడి వాతావరణం భయానకంగా వుంది. మంత్రగాడి హుంకారాలు, మంత్రాల ఉచ్ఛరణ, దయ్యం పట్టిన సుధ కేకలతో ఆ ప్రదేశం మారుమ్రోగుతోంది. ఊరిజనం చుట్టూ గుమిగూడి జరిగే తంతును మిడి గుడ్లేసుకుని చూస్తున్నారు. సుధలో తిష్ట వేసుక్కూర్చున్న దయ్యం గట్టిదేమో ఎంతకీ లొంగడం లేదు. దారికి రావడం లేదు. మంత్రాల మారెయ్య రెచ్చిపోతూ సుధ జుట్టును ఒడిసి పట్టుకుని పోతావా లేదా అంటూ వేపమండలతో చితక బాదుతున్నాడు.

ఆ దృశ్యాన్ని చూసి పిల్లలు జడుసుకుంటారనే ఉద్దేశంతో వారిని చీర కుచ్చెళ్ళమధ్య దాచి వుంచి కాస్త దూరంగా నిలబడి లోనికి తొంగి చూస్తున్నారు తల్లులు. ఆరు గుంజల కొట్టంలో నడిమధ్యన పేడతో అలికి వేసిన చుక్కల ముగ్గు మీద జుట్టు విరబోసుకుని కూర్చున్న సుధ పళ్ళు పటపటా కొరుకుతూ ఎర్రటి కండ్లతో మంత్రగాడిని కోపంగా చూస్తోంది. వదిలితే మంత్రగాడి పీక కొరికి రక్తం తాగేట్లు వుంది ఆమె ఉద్రేకం.

ఆమె ఎదురుగా నిలబడి వేపమండలు చేతబట్టుకొని ఆవేశంగా అరుస్తున్నాడు మంత్రగాడు మారెయ్య. వేపమండలతో తలపై కొట్టినప్పుడల్లా సుధ నాలుక బయటపెట్టి కనుగుడ్లు చిత్రంగా తిప్పుతూ వళ్ళంతా కదిలేలా ఊగుతోంది. అపుడపుడూ అర్థంకాని భాషలో ఎవరినో తిడుతోంది. మధ్యలో హృదయ విదారకంగా ఏడుస్తోంది. అత్త నరసమ్మకు కాళ్ళూ చేతులూ ఆడటం లేదు.

నాలుగు రోజులనుండీ దయ్యం పట్టినట్లు వింతగా ప్రవర్తిస్తోంది సుధ. అత్త నరసమ్మకు ఏమీ అర్థం కావడం లేదు. ఏదైనా మాట్లాడితే చాలు వీధంతా వినబడేలా కేకలు వేస్తూ దయ్యంలా మీద పడి రక్కుతోంది. రాత్రంతా నిద్ర పోకుండా తల విరబోసుకుని మంచంపై కూర్చుని ఊగుతూ అత్త నరసమ్మను తిడుతోంది.

ఆ మాటలను, చేష్టలను బట్టి సుధ వంట్లోకి వచ్చిన దయ్యం ఖచ్చితంగా దిగవీధిలోని పుల్లయ్య కోడలు విజయలక్ష్మే అని తీర్మానించారు. అప్పట్లో ఆ పిల్ల మురళిని గాఢంగా ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని ఆశ పడింది. కానీ నరసమ్మే కట్నం ఎక్కువ ఇవ్వలేరని విజయను వద్దని వారించి సుధను తెచ్చి మురళికి చేసింది.

విజయ తల్లిదండ్రులు కూతురికి ఏవో మాయమాటలు చెప్పి బలవంతంగా పుల్లయ్య కొడుకుకు ఇచ్చి పెళ్ళి చేసారు కానీ వాడితో కాపరం చెయ్యలేక ఆ పిల్ల ఉరేసుకుని చచ్చిపోయింది. ఇప్పుడు మురళి మీద మోజు చావక ఈ

ఇంటి కోడలైన సుధకు దయ్యమై పట్టి పీడిస్తోంది. ఇది చచ్చి కూడా ఇంట్లో చేరి నన్ను పీడిస్తోంది దీన్ని ఎలా వదిలించాలబ్బా అనుకుంటూ పళ్ళు కొరుక్కుంది నరసమ్మ కోపంగా.

దయ్యాన్ని వదిలించాలంటే సుధను ముగ్గులో కూర్చోబెట్టాలి అని మంత్రగాడు చెప్పడంతో నట్టింట్లో ముగ్గు వేసి నిమ్మకాయలను, కోడిని, వేపమండలను, సుధను మంత్రగాడికి అప్పగించారు.

కబురందుకున్న సుధ అమ్మానాన్నలు కూడా వచ్చి కూతురి వింత ప్రవర్తనకు బిత్తరపోయారు. బంగారంలాంటి పిల్లకు ఏ గాలి సోకిందో ఏమో అంటూ లబోదిబోమని మొత్తుకున్నారు. వాళ్ళకు ఏం చెప్పాలో అర్థం కాక నీళ్ళు నమిలింది నరసమ్మ. చేసుకున్న వారికి చేసుకున్నంత అని అంటారు ఇందుకే కాబోలు. మాట్లాడితే మీదపడి కొడుతున్న సుధను చూస్తేనే భయపడుతోంది నరసమ్మ.

"తల్లీ విజయా.. నువు చాలా మంచిదానివి కదా. ఏం కావాలో చెప్పమ్మా. నీకు సమర్పించుకుంటాం. నీ కోరికలు ఏవో చెపితే అవి తీరుస్తాము. ఈ బిడ్డ సుధను వేధించకుండా వీళ్ళ పరువు తీయకుండా నువు వెళ్ళిపోమ్మా" అని అర్థించాడు మంత్రగాడు.

"హహహా.. ఏం కావాలన్నా ఇస్తార్రా.." హుంకరించింది సుధ.

"ఇస్తామమ్మా ఇస్తాం. నీకు కోడిని కోసి రాగి సంగటి చేసి పెట్టమంటావా. మేకపోతును కోసి తలకాయ కూర వండిపెట్టమంటావా?ఏం చెయ్యమంటే అది చేస్తాం చెప్పు తల్లే.." అన్నాడు మంత్రగాడు.

"చెప్తారా చెప్తాను.. తొందరలో చెప్తాను. రేయ్.. చెప్పినాక మీరు నా కోరిక తీర్చకపోతే నా మాట వినకపోతే మీ రక్తం తాగుతానొరేయ్" కేకలేసింది సుధ.

ఊగి ఊగి అలసట వచ్చిందేమొ ఆ పూటకు దయ్యం వదిలి పోయింది.

మరసటిరోజు పొద్దున్నే వంట్లోకి వచ్చిన దయ్యం "రేయ్ ఎక్కడ చచ్చావురా? కోడి కూర ఏదిరా? ఆకలి.. ఆకలి" అని కేకలు వేసింది.

కోడిని కోసి కూరొండి రాగిపిండి సంగటి చేసి పెట్టారు. ఆవురావురుమని మొత్తం తినేసింది సుధ.

ఇక ఈ బిడ్డను వదిలి పోమ్మా మంచిదానివి కదా అని ప్రాధేయపడుతున్నారు.

"హహహా.. నేను అంత సులభంగా పోతానా.." నవ్వింది సుధ.

ఏం కావాలో చెప్పమ్మా తల్లీ.. చెప్పు" ఈసారి అత్త నరసమ్మ ప్రాధేయపడుతోంది.

"ఏమే.. పిశాచీ.. నీ వల్లనే నేను చచ్చిపోయానే. నీ రక్తం తాగుతానే ముసల్దానా" అంటూ నరసమ్మ గొంతు పట్టుకోబోయింది దయ్యం.

మంత్రగాడు అడ్డుపడి విడిపించకపోతే నరసమ్మ పని అంతే అయ్యేది. దెబ్బకు భయపడి" బతికానురా దేవుడా" అనుకుంటూ వెనక్కిపోయింది నరసమ్మ.

మంత్రగాడి ప్రదర్శనలతో, వేడికోళ్ళతో కాస్త శాంతించింది దయ్యం.

"రేయ్ నన్ను నా మురళిని విడదీసిందిరా ఈ ముసల్ది. అందుకే నా వాడి కోసం దయ్యమై వచ్చానురా. నా మురళి దగ్గరికి నన్ను పంపించండి రా. ఒకసారి నా ప్రియున్ని కళ్ళతో చూసుకుని దీన్ని వదిలిపోతానురా" అంది.

"తల్లీ.. మురళి కొయేటులో వున్నాడు కదా. అక్కడికి నువ్వు ఎట్ట బోతావు చెప్పు" అని అడిగారు నవ్వుతూ.

"అదేరా నేను చెప్పేది. మురళి పెళ్ళాం సుధకు పాస్పోర్టు వుంది కదా. వీజా పంపమని మురళిని అడగండిరా. సుధలోపల వుండేది నేనే కదరా.. నెలరోజుల్లోపల సుధను కొయేటికి పంపకపోయారో మీ అంతు చూస్తా" బెదిరించింది దయ్యం.

దయ్యం తెలివికి మంత్రగాడే ఆశ్చర్యపోయాడు.

"సరే తల్లీ అలాగే చేస్తాం. నువు కొయేటికి పొయినాక మురళిని చూసినాక ఈ బిడ్డను వదలకపోతే మేము ఏమి చెయ్యాల" అడిగాడు మరలా.

"మూర్ఖుడా.. మీ మనుషుల్లాగా దయ్యాలు మాట తప్పవురా.
మాటంటే మాటేరా. నా మురళిని ఒకసారి చూసుకుని నేను సుధను వదిలి పోతానురా. అదిగో ఆ స్వర్గ లోకం చేతులు సాచి పిలుస్తోంది నన్ను. అదే నా అదే నా స్థిర నివాసం అక్కడికి పోతానురా" అంది.

వెంటనే మురళికి ఫోన్లు వెళ్ళాయి.

నరసమ్మ కుక్కిన పేనులా కొడుక్కి విషయం చెప్పి తొందరగా ఇండియాకు రమ్మని చెప్పింది. అంతా విన్న మురళి విషయం అర్థమయినట్లు నిట్టూర్చాడు.

పదిరోజుల్లో కువైట్ నుండి వచ్చే విమానం దిగాడు. వస్తూ వస్తూ సుధకు కూడా వీజా తీసుకొచ్చాడు.

మురళిని చూడగానే గట్టిగా కౌగలించుకుని ఏడ్చింది సుధ. మురళిని, చేతిలోని వీజాను చూడగానే దయ్యం పరార్ అయి పోయింది.

మరో పదిరోజుల్లో సుధకు మెడికల్ చేయించి ఇద్దరూ కువైట్ కు వెళ్ళి పోయారు. మురళి వున్నన్ని రోజులూ తల్లితో ఎక్కువగా మాట్లాడలేదు. సుధతోనే సంతోషంగా కాలం గడిపాడు.

కువైట్ వెళ్ళే ముందు నరసమ్మతో ఒకే ఒక్కమాట చెప్పాడు.

"నువు సుధను అత్తలా కాకుండా అమ్మలా చూసుకుని వుంటే ఇంతపని జరిగేది కాదు.
ఇంత జరిగాక ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకో అమ్మా.." అన్నాడు.

నరసమ్మ సిగ్గుతో తలవంచుకుంది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments